


రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్



వార్త

## స్కూల్స్‌కు దగ్గరలోని స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీలు కోరుకోవాలి : డిఇఓ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 15, ప్రభాతవార్త**

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన స్పౌజ్ పాయింట్స్ ఉపయోగించుకునే దంపతులు వెబ్ ఆప్షన్ ఆప్షన్‌లో పని చేస్తున్న పాఠశాలలకు దగ్గరలో ఖాళీలను మాత్రమే వెబ్ ఆప్షన్‌లో ప్రాధాన్యత క్రమంలో కోరుకోవాలని మేడ్చల్ జిల్లా డిఇఓ విజయ కుమారి సూచించారు. ఒక వేళ దగ్గర పాఠశాల కాకుండ దూరంగ ఉన్న పాఠశాలలను కోరుకుంటే వారిపై శాఖపరంగ క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జిఓ 5ప్రకారం కాకుండ ఎవరైనా నకిలీ వైద్య ధృవీకరణ పత్రములు సమర్పించినా ప్రిపరెన్షియల్ కేటగిరిలు వితంతువు, పిహెచ్‌సి, డిపెండెంట్ గురించి ఎలాంటి తప్పడు సమాచారం అందించినా వారిపై శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డిఇఓ విజయకుమారి పేర్కొన్నారు.

## ముస్తాబవుతున్న కాంగ్రెస్ విజయభేరి సభ

**- సభ ప్రాంగణాన్ని పరిశీలించిన కాంగ్రెస్ అగ్రనాయకులు**



విజయభేరి సభకు భారీ ఏర్పాట్లు



పోలీసులతో మాట్లాడుతున్న స్థానిక నాయకులు.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబర్ 15, (ప్రభాతవార్త) :** రంగారెడ్డిజిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో ఆదివారం జరగనున్న కాంగ్రెస్ పార్టీ విజయబేరి మహాసభను విజయవంతం చేయడానికి రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భట్టివిక్రమార్క నేతృత్వంలో బహిరంగ సభ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సభకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది జనసమీకరణ చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. రంగారెడ్డిజిల్లాలో జరుగుతున్న ఈ సభకు స్థానికంగా మహేశ్వరంతో పాటు, ఇబ్రహీంపట్నం, ఎల్బినగర్, కల్వకుర్తి, షాద్‌నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్, వికారాబాద్, తాండూరు నగర శివారు ప్రాంతాల నుంచి దాదాపు 2 లక్షల మంది జన సమీకరణ చేపడుతున్నారు. ఆయా నియోజకవర్గాల ఇంఛార్జీలను నియామించారు. నియోజకవర్గ ఇంఛార్జీలతో పాటు మండలాలు, మున్సిపాలిటీల వారిగా కూడ ప్రత్యేకంగా కొంత మంది రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులను ఇంఛార్జులుగా నియమించారు. జనసమీకరణ కోసం ప్రత్యేక వాహనాలతో పాటు, ఆయా నియోజకవర్గాల వాహనాలను కూడా ముందుగానే సమకూర్చుకుంటున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో అత్యధిక శాతం మందిని తరలించడానికి ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. విజయ సభ ప్రాంగణంలో భారీ క్రేయిన్లతో సభను ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే సభ ప్రాంగణంతో పాటు విఐపీలకు, ప్రజలకు, మహిళలకు విడివిడిగా గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విజయబేరి సభ ఏర్పాట్లను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వేణుగోపాల్, వి.హనుమంత్‌రావు, మల్లురవి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, కొత్త మనోహార్‌రెడ్డి, పారిజాత నర్సింహ్మారెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్15, ప్రభాతవార్త:** గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న యువకున్ని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఐ రామకృష్ణతో పాటు పెట్రోలింగ్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ యువకుడు అనుమానస్పదంగా పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. అ యువకున్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అతను ఇబ్రహీంపట్నం అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన రెడ్డిమల్ల భరత్ (20)గా గుర్తించారు. నిందితుడు నిత్యం హైదరబాద్ దూల్‌పేట్ నుండి గంజాయిని తీసుకొచ్చి ఇబ్రహీంపట్నంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తెలినట్లు చెప్పారు. నిందితుని వద్ద నుండి 200గాముల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

## ఆరోగ్య తెలంగాణను సాధిద్ధాం



వర్చువల్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్

**-ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సర్కారు కృషి**
**-కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటు**
**-ప్రతి యేటా 10 వేల మంది వైద్యులు తయారు**
**-గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి**

**వికారాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:**

ఆరోగ్య తెలంగాణ ను సాదించే దిశగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేందుకు సంకల్పించారని గనులు భూగర్భ వనరుల శాఖ, పౌర సంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలను శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యశాఖ కార్యదర్శి రిజ్వీ తో పాటు వైద్యశాఖ ఉన్నతాధికారులతో కలిసి వర్చువల్ విధానం ద్వారా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రారంభించారు. వికారాబాద్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చించి వైద్య కళాశాలలను నెలకొల్పడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇప్పటికీ 26 వైద్య కళాశాలను ప్రారంభించడం జరిగిందని, ఈ కళాశాలల ద్వారా ప్రతి ఏటా పదివేల మంది డాక్టర్లను తయారు చేసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. వైద్య వృత్తిని వ్యాపార పరంగా కాకుండా, సేవా దృక్పథంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి వైద్య విద్యార్థులకు సూచించారు. వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం భారీ ఖర్చుతో కూడిన పని అయినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించే దిశగా వైద్య కళాశాలలను నెలకొల్పడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. వైద్యులను ప్రజలు దేవుళ్ళతో కొలుస్తారని, పేదల ప్రాణాలను కాపాడే, సేవ చేసే ఇలాంటి వృత్తిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలకు మంచి సేవలు అందించడంతో మనసుకు ఎంతో ఆనందాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తుందని ఆయన అన్నారు. గతంలో 3 వైద్య కళాశాలలున్న తెలంగాణలో 36 వైద్య కళాశాలలను ఏర్పాటు చేసుకోవడం తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమని మంత్రి అన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కళాశాలలో ప్రవేశాలు పొందిన విద్యార్థిని, విద్యార్థులకు మంత్రి అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు కావడం ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాకు వైద్య కళాశాల రావడం వల్ల ప్రజలకు అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఆయన అన్నారు. వైద్య కళాశాలను తెలంగాణ ఊటీ గా పిలువబడే ప్రాంతంలో, మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన సమస్యను తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థులు రాబోయే వైద్య విద్యార్థులకు ఆదర్శనీయంగా ఉంటూ.. రానున్న రోజుల్లో మంచి కళాశాలగా మార్చుకుందామని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఏ సమస్య తలెత్తిన సహనంతో పరిష్కరించుకోవాలని సూచించారు. వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, తాను వృత్తిరిత్యా వైద్యుడినేనని, తనకు ఎన్నో మంచి అవకాశాలు వచ్చిన తాను పుట్టిన చోట వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఇక్కడే స్థిరపడటం జరిగిందని తెలిపారు. కన్న తల్లిని, మాతృ భాషని, పుట్టిన గడ్డని ఎప్పటికీ మరువరాదని తెలిపారు. సామాన్య ఎంబీబీఎస్ డాక్టర్లుగా కాకుండా సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు గా ప్రతి వైద్య విద్యార్థి ఎదగాలన్నారు. నిష్ణాతులైన వైద్యులుగా తయారైన తర్వాత విదేశాలకు వెళ్ళకుండా సొంత గడ్డపై వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, కోడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, జెడ్పి వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, డిసిసిబి చైర్మన్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల్‌కుమార్ గౌడ్, ఎంపీపీ చంద్రకళ, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, వైద్య కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పద్మమాలిని, సూపరింటెండెంట్ రామచంద్రయ్య, వికారాబాద్ ఆర్డిఓ విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థులతో మంత్రి మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు

## నేడు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభం

**- సిఎం కెసిఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సబితారెడ్డి**

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబర్ 15, (ప్రభాతవార్త) :** పాలమూరు రంగారెడ్డి జిల్లాల ఎత్తిపోతల పథకం వెటర్‌న్‌ను శనివారం అంగరంగవైభవంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తున్న సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి శుక్రవారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల జలాలతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు సస్య శ్యామలం కానున్నాయని అన్నారు. ఎన్నో దశాబ్దాలుగా జిల్లా వాసుల ఎదురు చూపులకు నేటితో తెర పడనున్నదని ఆమె అన్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 70 మండలాల్లోని 1226 గ్రామాలకు తాగునీరును అందించడం జరుగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 6 జిల్లాల్లోని 19 నియోజకవర్గాలు ప్రయోజనం పొందనున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 20 మండలాలల్లో 330 గ్రామాల్లో 3,59,047 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 18 మండలాల్లో 417 గ్రామాల్లో 3,41,951 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో 90,028, వికారాబాద్ నియోజకవర్గంలో 94,871, తాండూరులో 1,02,797, చేవేళ్లలో 1,24,714 ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గంలో 79,996, ఇబ్రహీంపట్నంలో 69057, మహేశ్వరంలో 39,197, రాజేంద్రనగర్‌లో 8,972 ఎకరాలకు నీల్లు అందుతాయని మంత్రి వివరించారు. పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో రంగారెడ్డి వికారాబాద్ జిల్లాలు కృష్ణా జలాలతో పునీతం కానున్నాయని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో సాగునీటి ఇబ్బందులు తొలగిపోనున్నాయని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రంగారెడ్డి వికారాబాద్ జిల్లా వాసుల కలలను నిజం చేస్తున్న మన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రెండు జిల్లాల ప్రజలు రుణపడి ఉంటారని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.



. సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి.

## నల్సార్‌లో నాణ్యతా ప్రమాణాలపై పర్యవేక్షించిన ఎన్ఎసి ప్రతినిధి బృందం

**-నల్సార్ లా యూనివర్సిటీకి 25ఏళ్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు**

**-ఎన్ఎసి-ఏ గ్రేడ్‌లో కొనసాగుతున్న నల్సార్**



శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీని సందర్శించిన ఎన్ఎసి ప్రతినిధి బృందం, పాల్గొన్న వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్, అధ్యాపకులు

**శామీర్‌పేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త**

శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీని జాతీయ నేషనల్ అసెస్‌మెంట్ అక్రెడిటేషన్ కౌన్సిల్ ఐదుగురు ప్రతినిధి బృందం సందర్శించింది. మూడు రోజుల పాటు శామీర్‌పేటలోని నల్సార్ లాయూనివర్సిటీలో నాణ్యత ప్రమాణాల పర్యవేక్షణ కోసం ఆ బృందం సందర్శించి పర్యవేక్షించింది. శుక్రవారం సాయంత్రంతో ఆ బృందం పర్యవేక్షణ ముగిసింది. జాతీయ స్థాయిలో యూనివర్సిటీల ఉన్నత విద్యాసంస్థల నాణ్యత ప్రమాణాలను నిర్ణయించే జాతీయ నేషనల్ అసెస్‌మెంట్, అక్రెడిటేషన్ కౌన్సిల్-2023కు చెందిన ఐదుగురు ఈ నెల 13నుంచి 15వ తేదీ వరకు పాల్గొని పర్యవేక్షించారు. ఈ బృందానికి ప్రొఫెసర్ కమలజిత్‌సింగ్, వైస్‌చాన్స్‌లర్ మధుసూదన్‌లా యూనివర్సిటీ కటక్ అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ తరుణ్ అరోరా, ప్రొఫెసర్ పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీ మెంబర్ కోఆర్డినేటర్‌గ వ్యవరించారు. ప్రొఫెసర్ విఆర్‌సి కృష్ణయ్య, హనరరీడీన్ లా విభాగం శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి, ప్రొఫెసర్ అజేయ్ కుమార్ చాణక్య, నేషనల్ లా యూనివర్సిటీ పాట్నా ప్రొఫెసర్ ఆర్ ఎస్ మీనా కామర్స్ విభాగం, బనారస్ హిందూ యూనివర్సిటీ సభ్యులుగా వ్యవరించారు. ఇదీ ఇరవై ఐదు సంవత్సరాల నల్సార్ లాయూనివర్సిటీ పయనంలో నాక్ (ఎన్ఎసి) చేసిన రెండవ నాణ్యత పరిశీలన ఇప్పటికీ నల్సార్‌కు నాక్-ఏ గ్రేడ్ ఉందని అన్నారు. అయితే ఈ రెండవ సారి పరిశీలనలో 2017నుంచి 2022వరకు నల్సార్ చేసిన విద్యాపర ప్రయాణాన్ని అంఛనా వేశారు. కౌన్సిల్‌కి నల్సార్ పంపించిన సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ ఆధారంగ ఈ క్షేత్రస్థాయి బృందం మూడు రోజుల పాటు పరిశీలన చేసింది. వచ్చే నెలలో కౌన్సిల్ ఈ రెండవ సైకిల్‌ను పురస్కరించుకుని నల్సార్‌కు గ్రేడ్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. నల్సార్ లాయూనివర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నాణ్యతా పరిశీలన గ్రేడింగ్ తెస్తుందన్నారు. యూనివర్సిటీ పనితీరును కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టటానికి మొత్తం యూనివర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది భాగ కృషి చేశారని నల్సార్‌లా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు పేర్కొన్నారు. ఈ సారి కౌన్సిల్ బృందం పర్యటన నల్సార్ స్థాయిని పెంచుతుందని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగ అవిశ్రాంతంగ గత ఆరునెలల నుంచి శ్రమిస్తున్న నల్సార్ సిబ్బందికి వైస్‌చాన్స్‌లర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్నికల రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్‌లను పరిశీలించిన కలెక్టర్

**కీసర, సెప్టెంబరు15, ప్రభాతవార్తః** మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కుకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవార్గలకు రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ సంబందించి నూతనంగా ఏర్పాటు చేయడానికి అవసరమైన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ పరిశీలించారు. శుక్రవారం మండలంలోని బోగారం గ్రామంలోని హోలీమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో ఐదు నియోజకవర్గాలకి సంబందించి రిసిప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన వసతులు ఉన్నాయా ? లేదా ? అనే విషయాలను స్వయంగా పరిశీలించారు. కాలేజీ ఆవరణతో పాటు కాలేజీలో రిసిప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్‌కు సంబందించి బందోబస్తు, స్ట్రాంగ్ రూం, హాలును పరిశీలించారు. ఈవిఎం స్ట్రాంగ్ రూం ఎక్కడ అని అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉండేలా ఉంటే దీనిని మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రిసిప్షన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లయితే అందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా బ్యారీకేడ్లు తదితరాలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కాలేజీ ఆవరణలో ఆర్ఓ, ఈఆర్ఓ, ఏఆర్ఓ, ఏఈఆర్ఓ అధికారులను పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కలెక్టర్ సైదులు, ఆర్‌డిఓ శ్యాం ప్రకాష్, రాజేష్‌కుమార్, ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హోలీ మేరీ కాలేజీలో ఎన్నికల రిసిప్షన్, కౌంటింగ్ సెంటర్‌లపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్న కలెక్టర్ అమోయ్‌కుమార్

## ప్రశాంతంగా ముగిసిన టెట్ పరీక్ష

**-పరీక్ష కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**



సంగం లక్ష్మీబాయి పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

**వికారాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) శుక్రవారం వికారాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు సైతం పరీక్ష సమయానికి ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. అధికారులు సైతం అభ్యర్థులకు తగు మౌళిక వసతులు కల్పించారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, సంగం లక్ష్మీభాయి పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. పేపర్ 1 పరీక్షకు 5,765 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 5,160 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 605 మంది గైర్హాజరయ్యారు. పేపర్ 2 పరీక్షకు 3,846 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 3,689 మంది అభ్యర్థులు హాజరు కాగా, 157 మంది గైర్హాజరు అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

### మేడ్చల్ జిల్లాలో ...

మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 15, ప్రభాతవార్త : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఉపాధ్యాయ అర్హత (టెట్)-2023 పరీక్షలు ప్రశాంతంగ జరిగాయి. శుక్రవారం మేడ్చల్ జిల్లా వ్యాప్తంగ టెట్ పరీక్షలు ప్రశాంతంగ జరిగాయి. పేపర్-1కు 32 పరీక్షా కేంద్రాలను, పేపర్-2కు 25పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. పేపర్-1 పరీక్షకు 7, 560మంది అభ్యర్థులు ఉండగ వీరిలో 6,100మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. 1460మంది అభ్యర్థులు పేపర్-1 కు గైర్హాజరు అయినట్లు ఆమె తెలిపారు. పేపర్-2కు 5,766మంది అభ్యర్థులు ఉండగ వీరిలో 5,106మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పేపర్-2కు 660మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరు అయినట్లు డిఇఓ విజయకుమారి తెలిపారు.

## వామ్మో చైన్ స్నాచర్

**-మహిళా మెడలో నుండి పుస్తెలతాడు అపహరణ**

**-భయాందోళనకు గురువుతున్న గ్రామీణ మహిళలు**

**నందిగామ సెప్టెంబర్15, ప్రభాతవార్త :** మహిళ మెడలో నుండి పుస్తేల తాడు దోంగిలించి పారిపొయిన గుర్తుతెలియని చైన్‌స్నాచర్ ఉదంతం శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. నందిగామ మండలం అప్పరెడ్డి గూడ గ్రామానికి చెందిన చిలకమారి మంజుల (35) ఉదయం నందిగామకు బ్యాంకు విషయం పనిమీద వెళ్లిందని, తిరుగి ఇంటికి వచ్చే క్రమంలో చంద్రాయన్‌గూడ కూడలి వద్ద మోటర్ సైకిల్‌పై వచ్చిన ఓ అగంతకుడు మంజుల మెడలో ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాకేళ్లినట్లు సర్పంచ్ జె.కే నర్సింలు తెలిపారు. చైన్ స్నాచర్‌ను అదే గ్రామానికి చెందిన డీలర్ కృష్ణ వెంబడించిన ఫలితం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటన విషయమై నందిగామ పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సమాచారం తెలిసిన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్ హుటాహుటిన అప్పరెడ్డిగూడకు వెళ్లి సిసి పుటేజీలు పరిశీలించిన ఆనవాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

## శాంతిభద్రతలు పరిరక్షణే ధ్యేయం

**- రాచకొండ సిపి డిఎస్ చౌహాన్**
**- ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభం**
**- శాంతి భద్రతలతో అభివృద్ధి : ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను రాచకొండ సిపి డిఎస్ చౌహాన్‌తో కలిసి ప్రారంభిస్తున్న స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్15 ప్రభాతవార్త:**

తెలంగాణలో శాంతిభద్రతలు పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పరిచేస్తున్నారని రాచకొండ పోలీస్ కామీషనర్ డిఎస్ చౌహాన్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా రాచకొండ పోలీస్ కామీషనర్ డిఎస్ చౌహాన్ మాట్లాడుతూ...సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజలను పోలీసులు గౌరవించి తగు న్యాయం జరిగేవిదంగా చూడాలని ఆయన సూచించారు. ప్రశాంత వాతావరణం ఉన్న చోటే అభివృద్ధి జరుగుతుందన్నారు. తెలంగాణలో గతంలో ఎన్నడూ లేనివిదంగా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు, సిబ్బంది నియామకంతో క్షణాల్లో కేసులు చేదిస్తున్నామన్నారు. ముఖ్యంగా రాహదారులపై జరిగే ప్రమాదాల నివారణ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతోనే ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. దేశంలోను తెలంగాణ పోలీసులకు మంచి గుర్తింపు ఉందని పోలీసులు మరింత బాధ్యతగా పనిచేయాలని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నుండి హైదరాబాదు ప్రాంతానికి రోజుకు 60 నుండి 70వేలకుపైగా ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారని ట్రాఫిక్ పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పటిష్టతో నియోజకవర్గంలో ఏలాంటి అవాంఛనీయ సంగటనలు జరగడంలేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్, ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎసిపి శ్రీనివాస్, ట్రాఫిక్ సిఐ గురునాయుడు, సిఐ రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సెన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మెన్ అకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో కుక్కల స్వైర విహారం

**-ఆరుగురు చిన్నారులను కాటేసిన కుక్కలు**

**శంషాబాద్ సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** శంషాబాద్ పురపాలక సంఘం పరిదిలోని పలు ప్రాంతాలలో శుక్రశారం వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. వివిధ బస్తీలలో చెలరేగిపోయిన కుక్కలు ఆరుగురు చిన్నారులను కాటేశాయి. ఈ సంఘటనపై బస్తీవాసులు తీవ్ర అగ్రహవేషాలు వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని కాజీ గల్లి, మక్త బదురలి, సాదత్ కాలనీ ప్రాంతాలలో కుక్కలు విచ్చలవిడిగా రెచ్చిపోయాయి. ఎండి మిరాజ్, నైరా మస్కారి, మౌలానా, అనే బాలలను వీధి కుక్కలు కాటేశాయి. వీరందరి వయస్సు మూడు సంవత్సరాల నుండి పది సంవత్సరాల లోపు ఉంటుంది. కుక్క కాటుతో తీవ్ర భయాందోళనకు గురైన ప్రజలు చిన్నారుల ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. ఈ సంఘటనపై స్థానిక కౌన్సిలర్ మస్రత్ తాజ్ బాబా ఆందోళన వ్యక్త చేశారు. మున్సిపల్ అధికారులు వెంటనే వీధి కుక్కలను పట్టే సిబ్బందిని రప్పించి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



గుంపు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

## మున్సిపల్ కార్మికుల నిరసన



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

**మేడ్చల్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం ముందు తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం మద్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకు శాంతి యుత నిరసన చేపట్టిన అనంతరం పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, తక్షణమే ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మూడు సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వరకు ఉన్న ఉద్యోగులందరని వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. అదే విదంగా ఇటీవల వివిద శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను క్రమ బద్దీకరించిన విదంగా తమరిని కూడ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాధా బాయి, మల్లేష్, కార్యదర్శులు లావణ్య, విఘ్నేష్, నాయకులు పెంటయ్య, దివ్య, సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించాలి: చైర్మన్



అన్నోజిగూడ ఎన్‌టీపీసీ రోడ్డులో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాల తొలగింపు విషయమై అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ బి. కొండల్‌రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించాలని మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి విద్యుత్ అధికారులను కోరారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ ఎన్‌టీపీసీ రోడ్డులో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలతో రాకపోకలు సాగించే ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఘట్‌కేసర్ విద్యుత్ అధికారులతో కలిసి శుక్రవారం చైర్మన్ కొండల్ రెడ్డి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను పరిశీలించారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించాలని ఏఈలు ప్రదీప్, సతీశ్‌లను కోరారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంబడి స్థానిక నాయకులు కేఎం. రెడ్డి, జితేందర్ నాయక్, సుధాకర్, మురళి, లక్ష్మణ్ యాదవ్, అర్జున్ పలువురు కాలనీవాసులు తదితరులున్నారు.

### డిమాండ్ల సాధన కోసమే మున్సిపల్ కార్మికుల సమ్మె

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం శాంతియుత నిరవధిక సమ్మె నిర్వహించారు. పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టారు. తమకు మున్సిపల్‌లో ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మె చేపట్టారు. తమ ఉద్యోగ భద్రతతో పాటు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరుతూ ఈ నెల 20 వ తేది వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బిల్ కలెక్టర్ రాజు, సభ్యులు మధు, గాంధారి అశోక్, రంగ, బాల్ నర్సింహా, చంద్రశేఖర్, శివ, గోవర్ధన్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

**కీసర, సెప్టెంబరు15, ప్రభాతవార్త:** సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని నేతాజీనగర్ కాలనీలో సీసీ రోడ్ల పనులకు మున్సిపల్ సాదారణ నిధులు 7 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా చైర్మన్ మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులను నాణ్యతతో వేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. వేగంగా పనులు చేపట్టి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్, నాయకులు కౌకుట్ల క్రిష్ణరెడ్డి, అన్నంరాజు సురేష్. కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

### పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

**కొత్తూర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించి ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కొత్తూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ ఎంఎస్సీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ షాద్‌నగర్ నియోజకవర్గం ఇంచార్జీ పెంటనోళ్ల రవికుమార్ మాదిగ దీక్షలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....బీజేపీ ప్రభుత్వం మాదిగ ఉపకులాల మీద చిత్తశుద్ధి ఉంటే ఈనెల 18 నుండి 22వరకు జరుగు ప్రత్యే పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీల రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పెట్టి చిత్తశుద్దిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీయే మాధిగలకు ప్రధాన శత్రువుగా భావించాల్సి వస్తుందని మండిపడ్డారు. ఎమ్మార్పీఎస్ కొత్తూర్ మండల ఇంచార్జీ చెన్నగళ్ల అశోక్ మాదిగ మాట్లాడుతూ.... పాలకులతో పాటు ప్రతిపక్షాలు కూడా ఎస్సీ వర్గీకరణ కోసం పాలకులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సామాజిక న్యాయమని చెప్పి అనేకమార్లు మాట్లాడిన ప్రతిపక్షాలు మౌనం వహించడం మాదిగ ఉపకులాలకు ద్రోహం చేసినట్టేనని, ఇప్పటికైనా ప్రత్యేక పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించే విధంగా కేంద్రంపై ఒత్తిడి పెంచేవిధంగా ప్రతిపక్షాల నాయ కులు మాట్లాడాలన్నారు. ఈకార్యక్రమంలో తొంట జంగన్న మాది గ, పి.ఆంజనేయులు, కె.కృష్ణ, గడ్డం మెకానిక్ యాదయ్య, పి.శేఖర్, పి.మనోహర్, కె.రాజు, టి.యాదగిరి, కె.రాజు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ ఇంచార్జీ పెంటనోళ్ల రవికుమార్

# దళిత,బిసి బంధుపై పెరుగుతున్న ఆగ్రహ జ్వాలలు

-బిఆర్ఎస్‌కు ముడుగులొత్తే వారికి దళిత బంధు
-కమీషన్ ఇస్తేనే పేర్లు ఖరారు
-స్థానిక ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి సమాధానం చెప్పాలి : ప్రజాసంఘాలు



కుల్కచర్లలో ప్రశ్నిస్తున్న ప్రజా సంఘాలు (ఫైల్)

**కుల్కచర్ల సెప్టెంబర్15, ప్రభాతవార్త :** దళిత బందు బిసి బందు ఒక నాటకమని బిఆర్ఎస్ నాయకులకు లబ్ది చేకూర్చేందుకు ఈ పథకాలు పెట్టారని పిఎస్‌పిఎస్ వ్యవస్థాపక అద్యక్షుడు ఘనపురం రాఘవేందర్ గౌడ్ అన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించారుజీ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దళితబందు పేద వారికి కాకుండా కమీషన్లు ఎవరు ఇస్తే వారికి చెందుతున్నాయని బిసిలకు మిసి బందు కొన్ని కులాలకే పరిమితం చేయడం కేసిఆర్ నిరంకుష పాలనకు నిదర్శనాలని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే తన అనుచరులకు ఈ పథకాలను వేలం వేశారని లక్ష నుండి మూడు లక్షల వరకు కమీషన్లు ఇచ్చే వారికి పథకాలు వర్తింపచేస్తున్నారని పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న పలువురు దళితులు బిసిలకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇదేంటని ప్రశ్నిస్తున్న యువకులపై పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయిస్తున్నారని ఇకనైనా దళిత బిసి బందుపై పారదర్శకత పాటించకుంటే ఉద్యమాన్ని విస్తృత పరిచి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఓ కార్యలయంలో వినతి పత్రం సమర్పించారు.



కుసుమ సముద్రంలో దళితుల ఆందోళన

**కుసుమ సముద్రంలో దళితుల పోరుబాట**

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిదిలోని కుసుమ సముద్రం గ్రామానికి చెందిన దళితులు పోరుబాట పట్టారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి అని కాకుండా కమీషన్ల మహేష్‌రెడ్డి అని అంటే బాగుంటుందని దళితులు ఆరోపించారు. అర్హులకు కాకుండా గుడిసెలో నివసించే వారికి కాకుండా కమీషన్ ఇచ్చే స్థోమత కలిగిన వారికి దళిత బందుకు ఎంపిక చేశారని ఆక్రోషం వ్యక్తం చేశారు. ఇటువంటి ఎమ్మెల్యే మాకొద్దంటు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**ఇప్పాయిపల్లి గ్రామంలో :** కుల్కచర్ల మండలపరిదిలోని ఇప్పపల్లి గ్రామానికి చెందిన పలువురు దళితులు కుల్కచర మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బిఆర్ఎస్ పార్టీలో తిరుగుతున్న వారికేదళిత బందు వచ్చాయని ఇతరులకు ఎవరికీ రాలేదని నిరసనకు సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ పార్టి మండల ప్రదాన కార్యదర్శి గోపాల్‌నాయక్ ఆరోపించారు. ఇస్తే అందరికి ఇవ్వండి బిఎస్ ఆంజనేయులు కాంగ్రెస్ పార్టి మండల అద్యక్షుడు బిసి బందు అంటూ ఎమ్మెల్యే మహేషరెడ్డి మోసం చేస్తున్నాడు. ముదిరాజులకు ఎక్కడుంది బిసిబందు తినడానికి తిండి లేక చదువుకున్నవారికి ఉద్యోగాలు రాక సంతలో చాలామంది ముదిరాజులు కూరగాయలు అమ్ముకుంటున్నారు. తప్పని అనిపిస్తే కుల్క,నర్ల మండల కేంద్రంలోనూ ముజాహిద్‌నూర్ సంతలోకి రండి నిరూపిస్తా. ముదిరాజుల కు చేప పిల్లలు అవసరం లేదు దళితులకు ఇచ్చినట్లుగా 10 లక్షలు ఇవ్వండి. లేదా పరిగిలో పోటీ చేయకుండా దిగిపోండి. లేకపోతే లేదని కొందరికి మాత్రమే ఇవ్వగా రోజూ పలకరించుకునే మామధ్య వైషమ్యాలు పెంచరాదని అన్నారు. అందరికి దళిత బందు ఇచ్చే వరకూ ఎమ్మెల్యే ఇప్పపల్లికి రావొద్దంటూ నినాదాలు చేశారు.

# మంత్రి పదవికి సబితాఇంద్రరెడ్డి రాజీనామా చేయాలి : కాంగ్రెస్



**మహేశ్వరం సెప్టెంబర్ 15ప్రభాతవార్త** మహేశ్వరంలో సీనియర్ నాయకుడు కె రఘుమారెడ్డి పై బిఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలకు మహేశ్వరం సీనియర్ కాంగ్రేస్ నాయకులు ప్రత్యారోపణలు చేశారు. రఘుమారెడ్డి బిఆర్ఎస్ పార్టీకి తన ఎంపిటిసి,ఎపిపి పదికి ఒకే సారి రాజీనామా చేసి రఘుమారెడ్డి నైతిక విలువలను కాంగ్రేస్ నాయకులు కొనియాడుతూనే బిఆర్ఎస్ చేసిన విమర్శలు, ఆరోపణలను తెలివి తక్కువమాటలుగా కాంగ్రేస్ నాయకులు అభివర్ణించారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కొత్తమనోహర్‌రెడ్డి, ఎనుగు జంగారెడ్డి, పాండు రంగారెడ్డి,క్రిష్ణనాయక్‌తోపాటు పలువురు నాయకులు పాల్గోని బిఆర్ఎస్ నాయకులు మంత్రిసబితాఇంద్రారెడ్డిపై పలు ఆరోపణలు చేశారు. రఘుమారెడ్డి 70సంవత్సరాల వయస్సులో కూడా ఒక బాధ్యతతో నైతికవిలువలకు లోబడి పార్టీకి తన పదవులను గడ్డిపోస మాదిరిగా విసిరేశారని వారు గుర్తుచేశారు. రఘుమారెడ్డిపై విమర్శలు చేసిన నాయకులు ముందు మంత్రి సబితా ఇంద్రారెడ్డిని తమ పదవికి రాజీనామా చేయించాలని కాంగ్రేస్ పార్టీ గుర్తుపై గెలిచిన మంత్రి బిఆర్ఎస్ పార్టీలో ఒక క్షణం కూడా కొనసాగడానికి వీలులేదని వారు విమర్శించారు. రెండు రోజుల్లో మంత్రి సబితాఇంద్రారెడ్డి తమ పదవికి రాజీనామా చేయాలని మనోహర్‌రెడ్డి, ఎనుగుజంగారెడ్డి,పాండురంగారెడ్డిలు డిమాండ్‌చేశారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి రఘుమారెడ్డిపై విమర్శలు చేయించడపట్ల సర్వత్ర విమర్శలు వస్తున్నాయన్నారు. బిఆర్ఎస్ నాయకులు రఘుమారెడ్డి పై వాడిన భాష చాల దుర్మార్గమన్నారు. చీమునెత్తురుంటే అదే బిఆర్ఎస్ నాయకులు మంత్రిని రాజీనామా చేయించాలని. మంత్రి సబితాఇంద్రారెడ్డి అనుచరులు ఆమే కుమారుడు అనేక భూ అక్రమాలకు పాల్పడుతున్నారని త్వరలోఏ కాంగ్రేస్ పార్టీ అధికారంలోకి రాగానే విచారణ చేయిస్తామని మనోహర్‌రెడ్డి జంగారెడ్డి, పాండురంగారెడ్డి లు స్పష్టంచేశారు. మహేశ్వరంలో బిఆర్ఎస్ పార్టీకి డిపాజట్ కూడా రాదని ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ది చెప్పడానికి ఎదురుచూస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రేస్ నాయకులు చిగురింత పారిజాత నర్సింహ్మారెడ్డి, కందుకూర్ మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు క్రిష్ణనాయక్, పాండునాయక్, రాంచంద్రగూడ క్రిష్ణనాయక్,మల్లేశ్, అందుగుల సత్యనారాయణ. శ్రీకాంత్, అల్లే కుమార్,వత్తుల నారాయణ తదితరులు పాల్గోన్నారు

## 8వ తెలంగాణ స్టేట్ జూడో చాంపియన్‌షిప్



**మొయినాబాద్,15, సెప్టెంబర్, ప్రభాతవవార్త:** 8వ తెలంగాణ స్టేట్‌జూడో చాంపియన్‌షిప్ లో వెండి పతకం కైవసం చేసుకన్న టి.యస్.డబ్లు.ఆర్.ఎస్. చేవెళ్ల గురుకుల బాలికల స్వేచ్ఛా పాఠశాల విద్యార్ధిని దీపిక కైవసం చేసుకున్నారు, మొయినాబాద్ మండలంలోని తోల్కట్ట గ్రామ రెవెన్యూలోగల చేవెళ్ళ గురుకుల పాఠశాల ఇంటర్ విద్యార్ధిని యం.పి.సి దీపిక ద్వితీయ సంవత్సరం , తెలంగాణలో జరిగినటువంటి జూడో ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం నిర్వహించగా 48కేజిల విభాగంలో దీపిక వెండి పతకం సాధించడం జరిగింది, జాతీయ జూడో లో ప్రతి సారి అత్యుత్తమ ప్రతిభను కనబర్చుతున్న దీపికను ఉపాధ్యాయులు అభినందించారు, దీపిక జాతీయ జూడో కు ఎంపిక కాగానే ప్రన్సిపాల్ రామాదేవి, రాష్ట్ర స్దాయిలో మంచి ప్రదర్శనను కనబరిచి, జాతీయ స్దాయికి వెల్లడం పట్ల ఎంతో హర్షం వ్యక్తం చేశారు, దీపిక భవిష్యత్‌లో మంచి ఉన్నత స్దాయికి చేరుకోవాలని, మంచి విజయాలు సాధించేవిదంగా మేము అన్ని విధాల గురుకుల సోసైటి అండగా ఉంటుందన్నారు,

## ఉత్తమ గ్రామ పంచాయతీగా కొందుర్గు

**కొందుర్గు, సెప్టెంబర్ 15, (ప్రభాతవార్త) :** పంచాయతీ పరిధిలో పచ్చదనం పరిశుభ్రత పనులు పూర్తి చేసినందుకు గాను గుర్తించిన జిల్లా యంత్రాంగం కొందుర్గు గ్రామ పంచాయతీని జాతీయ స్థాయిలో ఇచ్చే 2023 సంవత్సరానికి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు ఇస్తూ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసిందని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈట గణేష్‌ల చేతుల మీదుగా సర్పంచి కావలి ఆదిలక్ష్మీ యాదయ్య అవార్డును అందుకున్నారు. జిల్లాలో 21 మండలాల్లోని 14 మండలలో ఎంపిక కాగా కొందుర్గు మండలం నుంచి కొందుర్గు గ్రామ పంచాయతీ ఒక్కటే అవార్డుకు ఎంపికైందని ఎంపీడీఓ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య, ఎంపీఓ జయమాలిని, ఏపీఓ నర్సింగ్‌రావు, మాజీ ఎంపీటీసీ కావలి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి



గొర్రెలను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

**షాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రంగారెడ్డి జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప తెలిపారు. షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామ, కొమరబండ గ్రామాల్లో రెండవ విడత గొర్రెల పంపిణీ విభాగంలో ఆయన లబ్దిదారులకు 5యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామీణ వృత్తులను గౌరవించేది తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. గ్రామాల్లో గ్రామీణ కులవృత్తులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాపాడుతూ వారికి గౌరవంగా జీవించేందుకు మార్గాలను చూపిస్తుందని వెల్లడించారు. గ్రామపరిధిలోని అన్ని వర్గాల ప్రజలను సంతృప్తి పరుస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను భారీగా చేపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో రేగడి దోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

## సిఎం కెసిఆర్ బహిరంగ సభకు పెద్దఎత్తున హాజరు కావాలి



మాట్లాడుతున్న కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షులు కంబాల పరమేష్, జడ్పీటిసి దశరథ్‌నాయక్

**కడ్తాల, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన నర్సాపూర్ పంప్ హౌస్‌లో నేడు ముఖ్యమంత్రి కెసిఆర్ మోటార్లు ప్రారంభించనున్న నేపథ్యంలో జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, ప్రజలు, రైతులు తరలిరావాలని కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షులు కంబాల పరమేష్, జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈ శతాబ్దపు అతిపెద్ద మానవ విజయం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రపంచంలోనే భారీ ఎత్తిపోతల పథకం అని అన్నారు. పరాయి పాలన ఒక శాపం, స్వపరిపాలన ఒక వరం. రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేస్తాను. పాలమూరు రైతుల కాళ్లను కృష్ణానది నీళ్లతో కడుగుతా, కృష్ణమ్మ నీళ్లను కలశాలలో గ్రామ, గ్రామానికి తీసుకువచ్చి ప్రతి దేవాలయం, ప్రార్థనాలయాలలో అభిషేకం చేస్తామని కెసిఆర్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల శంకుస్థాపన సందర్భంగా భూత్పూర్ బహిరంగ సభలో 11.06.2015రోజు అన్నారని దానిని చేసి చూపించారని కంబాల పరమేష్, జడ్పీటిసి దశరథ్ నాయక్, వెంకటేష్ అన్నారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ కన్వీనర్ జోగు వీరయ్య,రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, మండల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అవార్డు అందుకున్న సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి

**కడ్తాల్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ2023 అవార్డులలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో కడ్తాల్ గ్రామ పంచాయతీ ఉత్తమ గ్రామ పంచాయతీ 2023గా ఎంపిక చేయబడిన సందర్భంగా శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డిని శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వెంకటరమణారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, డిపిఓ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్‌డిఓ ప్రభాకర్, కడ్తాల్ ఎంపిడిఓ రామకృష్ణ, ఎంపిపి కమ్లిమొత్యానాయక్ పాల్గొన్నారు.

## క్లాక్‌టవర్ నుంచి పరకాలకు బిజెపి బైక్‌ర్యాలీ

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం పోరాటం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ శుక్రవారం సికింద్రాబాద్ నుంచి పరకాల వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కేంద్ర పర్యాటక మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు కిషన్‌రెడ్డి క్లాక్‌టవర్ సర్కిల్ నుంచి పరకాలలోని అమరధామం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టగా ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డులో ఆయనకు బిజెపి మాజీ రాష్ట్రఉపాధ్యక్షులు పెద్ది మోహన్‌రెడ్డి, ఎంపిపి, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌరస్తాలో వేదిక ఏర్పాటు చేసి యాత్రపై పూలు చల్లుతూ డీజే శబ్దాలతో కిషన్‌రెడ్డి స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఘట్‌కేసర్ నుంచి ఎంపిపితో పాటు నాయకులు కిషన్‌రెడ్డి వెంట బైక్ ర్యాలీలో పరకాల వరకు వెళ్లారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, గుండ్ల అంజనేయులు, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు కప్పరగళ్ల కరుణాకర్, సీబీఎఫ్‌సీ సభ్యులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, జిల్లా బిజెవైఎం ఉపాధ్యక్షులు శివకుమార్‌నాయక్, నాయకులు రావుల శ్రీకాంత్, బసవరాజుగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సదానందంరెడ్డి, పవన్, మచ్చేంధర్‌రెడ్డి, అజయ్, వీరారెడ్డి, సాయిలు,కుమార్,శోభన్‌బాబు, రాజిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

### విజయభేరీ మోగిద్దాం...సోనియమ్మ రుణం తీర్చుకుందాం



**తలకొండపల్లి సెప్టెంబర్15, ప్రభాతవార్త :** విజయభేరీ మోగిద్దాం సోనియమ్మ రుణం తీర్చుకుందామని మండల కాంగ్రెస్ పార్టీ దోకూరు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తలకొండపల్లి మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ....ఈ నెల 17 ఆదివారం జరగబోయే తక్కుగూడ విజయభేరి సభలో కల్వకుర్తి నియోజకవర్గం, తలకొండపల్లి మండలం నుంచి భారీగా నాయకులు,కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మకు మనం అండగా ఉండాలని 17న జరగబోయే విజయభేరి సభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కిసాన్ సెల్ నాయకులు మోహన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా, బిసిసి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, ఎంఎస్ యుఐ మండల అధ్యక్షుడు రమేష్, మండల సోషల్ మీడియా ఇంచార్జీ శశిధర్ రెడ్డి, రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థిని వైష్ణవి ప్రతిభ



జగ్గంగూడలోని జీనియస్ స్కూల్ విద్యార్థిని వైష్ణవి జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బ్రౌన్స్ మెడల్ సాధించటంతో అభినందించిన కరస్పాండెంట్ జె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ కల్పనారెడ్డి దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త** జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో జగ్గంగూడలోని జీనియస్ స్కూల్ విద్యార్థిని జి.వైష్ణవి బ్రౌన్స్ మెడల్ సాధించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలోని జీనియస్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని జి.వైష్ణవి జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని తన సత్తాను చాటారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కరాటే బొడాకాన్ అసోసిషియేషన్‌కి చెందిన జగ్గంగూడ జీనియస్ విద్యార్థిని తమ ప్రతిభను చాటి బ్రౌన్స్ మెడల్ సాధించినట్లు జీనియస్ గ్రామర్ హైస్కూల్ కరాటే కోచ్ ఎస్. నరేశ్ తెలిపారు. జీనియస్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ జె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ జె.కల్పనారెడ్డి ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఇక ముమ్ముందు మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షను తెలియజేశారు. ఆ స్కూల్‌కు చెందిన పలువురు ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు కూడ కరాటెలో ప్రతిభను జాతీయ స్థాయిలో చాటిన వైష్ణవిని పలువురు అభినందించారు.

### ఉద్యోగుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి : టిఎన్‌జిఓస్



మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు రవిప్రకాష్ రాష్ట్ర నాయకులతో కలిసి సచివాలయంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావును కలిసి దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 15, ప్రభాతవార్త** ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావును టిఎన్‌జిఓస్ రాష్ట్ర నాయకులతో మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు,ఉద్యోగుల జెఏసి చైర్మన్ రవిప్రకాశ్ కలిసి కోరారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా నుంచి టిఎన్‌జిఓస్ అధ్యక్షులు,ఉద్యోగుల జెఏసి చైర్మన్ రవిప్రకాశ్ సచివాలయంకు వెళ్లి రాష్ట్ర టిఎన్‌జిఓస్ అధ్యక్షులు,కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, జగదీశ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి కె.రామ కృష్ణరావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఆయనను కలిసి వారు కోరారు.

## గంజాయి ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్

-710 గ్రాముల గంజాయి ఆయిల్, 2 సెల్‌పోన్లు, స్కూటీ స్వాధీనం



గంజాయితో తయారు చేసిన ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ మల్లయ్యతో నిందితులు.

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** గంజాయితో తయారు చేసిన హశిశ్ అయిల్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. సంఘటన వివరాలు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ మల్లయ్య తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎఎస్. రావు నగర్‌లోని మ్యాక్స్ షాపింగ్ మాల్ వద్ద రూట్ వాచ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా గంజాయితో తయారు చేసిన హశిశ్ అయిల్ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిని విచారించగా అట్టి ఆయిల్‌ను వైజాగ్ నుండి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తుల నుండి దాదాపు 710 గ్రాముల హశిశ్ అయిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితుల వివరాలు తనేరు శివతేజ ( 23 ), నేర్మేడ్‌మెట్ ప్రాంతంలోని సైనిక్‌పురి సాయిరాంనగర్ కాలనీవాసి కాగా మరో నిందితుడు కర్ణ వేణు ( 23 ), సైనిక్‌పురి నివాసిగా పోలీసులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద 710 గ్రాముల గంజాయి అయిల్‌తో పాటు హోండా ద్విచక్ర వాహనం, రెండు రెడ్‌మీ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ మల్లయ్య తెలిపారు.

# కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

**కీసర, సెప్టెంబరు15, ప్రభాతవార్త:** కరెంట్ షాక్‌తో ఒక్క వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోధుమ కుంట గ్రామంలో రాజోరియా కిషన్ పాల్ (30) ప్లాట్ నంబర్ 480లో తన భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. కాగా శుక్రవారం తన ఇంట్లో లో ఓల్టేజీ కారణంగా కరెంట్ సరిగ్గా రావడం లేదని తన ఇంటి దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్టర్ దగ్గరికి చూడటానికి వెళ్లాడు. అతని వెంట తన కూతురు సోమీ (9)ని కూడా వెంట తీసుకెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లగానే షాక్ తగిలి ప్రక్కనే ఉన్న పొదల్లో పడిపోయాడు. తన కూతురు ఇంటికి వచ్చి తన తల్లితో పాపా చిపక్ గయే అని చెప్పడంతో వెంటనే సంధ్య అక్కడికి చేరుకుని చూడటంతో తన భర్తకు కరెంటు షాక్ తగిలింది అని తెలుసుకుని ఇరుగు పొరుగు వారి సహాయంతో వెంటనే నాగారంలోని విజయ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ ఉన్న డ్యూటీ డాక్టర్ అప్పటికే అతను మృతి చెందాడని తెలిపారు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### యువ ఇంజనీర్‌కు జేమ్స్ డైసన్ అవార్డు

**శామిర్‌పేట సెప్టెంబర్15, ప్రభాతవార్త :** ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ ఆవిష్కరణతో అందించిన ఒక వినూత్న పరిష్కారం మౌసేవారేకు ప్రతిష్టాత్మక జేమ్స్ డైసన్ అవార్డు దక్కింది. జాతీయ విజేతగా నిలిచిన ఆయన దివ్యాంగుల కదలికల కోసం సరికొత్త ఆవిష్కరణను చేశారు. తల కదలికల శక్తిని ఉపయోగించుకుని ఈ సాంకేతికత స్మార్ట్ పరికరాల నియంత్రణను అనుమతిస్తూ, వ్యక్తులు డిజిటల్ పరికరాలను శ్రమరహితంగా వినియోగించుకునేలా చేస్తుంది. జేమ్స్ డైసన్ అవార్డు 28దేశాల్లోని విద్యార్థులను స్పష్టమైన సమస్యలను సరళంగా పరిష్కరించే తెలివైన ఇంజనీరింగ్ సూత్రాలను రూపొందించమని ప్రోత్సహించింది.

## సర్పంచ్ లలిత జ్యోతయ్యకు స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్ర స్థాయి అవార్డు



**తలకొండపల్లి సెప్టెంబర్15,ప్రభాతవార్త :** తలకొండపల్లి సర్పంచ్ లలిత జ్యోతయ్య శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును జడ్పిచైర్‌పర్సన్ తీగల అనితహరినాథ్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రజాసేవ చేసిన వారికి మాత్రమే ఈ అవార్డులు లభిస్తాయని సర్పంచ్ లలితజ్యోతయ్యను అభినందనలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీకాంత్, పంచాయతీ సెక్రటరీ రాఘవేందర్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్, కడ్తాల్ సర్పంచ్ ఎల్ఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 19న మెగా హెల్త్ క్యాంప్

**తలకొండపల్లి సెప్టెంబర్15,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో కీర్తిశేషులు లయన్ కొత్త శంకరయ్య ఎంజెఎఫ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో మెగా హెల్త్ శిబిరాన్ని ఈ నెల 19న ఏర్పాటు చేస్తున్నట్లు క్యాంపు చైర్మన్ దోకూరు ప్రభాకర్ రెడ్డి, కో చైర్మన్ కండె ఓం కారం, మిట్టపల్లి అంజయ్య, పిఆర్ఓ పాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మెగా హెల్త్ వైద్య శిబిరంలో ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు, మధుమోహ పరీక్షలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చంద్రధన గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మున్సిపల్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతాం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

**కొత్తూర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ తెలిపారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని 10వ వార్డులో రూ.33కోట్లతో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ ప్రారంభించడం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ.... మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మెన్ డోలి రవీందర్, కమ్మరి యాదగిరిచారి, జహంగీర్, శ్రావణ్, యాదయ్య, వెంకటేష్, మాస్టర్ నరసింహ, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

## 'పట్నం' కాంగ్రెస్‌లో భారీ చేరికలు



టిపిసిసి ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుండి కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న నాయకులు

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 15,ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీలో ఖానాపూర్, రాయపోల్ గ్రామాల నుండి వివిధ పార్టీలకు చెందిన నాయకులు టిపిసిసి ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భారీగా చేరారు. అనంతరం రేపు జరగబోయే విజయ భేరి సభ వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తధ్యమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం జెడ్పిటిసి భూపతిగల్ల మహిపాల్, సుబ్బారు పాండు తదితరులున్నారు.

## గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై బల్‌రాంనాయక్

**ఆమనగల్లు, సెప్టెంబర్15, ప్రభాతవార్త:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆమనగల్లు ఎస్సై బల్‌రాంనాయక్ సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ప్రమేయం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి సమావేశం నిర్వహించారు. సమావేశానికి మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, జేఏసి నాయకులు పాపిశెట్టి రాముతోపాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు హాజరైనారు. ఈసంధర్భంగా ఎస్సై బల్‌రాంనాయక్ ఉత్సవాల నిర్వహణపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి మండపం వద్ద ఇద్దరు వ్యక్తులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిమ్మజ్జన సమయంలో పాటించవలసిన సూచనలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, చెన్నకేశవులు, దుద్దు కృష్ణయాదవ్, కాలె మల్లయ్య, టిల్లుయాదవ్, తోట ఆనంద్, జెజ్జాయిల ఆనం ద్ తదితరులు ఉన్నారు.



ఇంజనీర్స్‌డే సందర్భంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం పిఆర్ ఎఇ గుర్రం ఇంద్రసేనారెడ్డికి పిఆర్టీయు ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షులు వర్కాల పరమేష్, శ్రీనివాస్ రెడ్డి, ఐలయ్య, భాషా తదితరులు చిత్రపటాన్ని బహుకరించి ఘనంగా సన్మానించారు.

# ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి : ఎసిపి రాంచందర్ రావు





నందిగామలో శాంతి కమిటీలో మాట్లాడుతున్న శంషాబాద్ ఎసీపి రాంచందర్ రావు

**నందిగామ సెప్టెంబర్15,ప్రభాతవార్త :** ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ చతుర్థి, మిలాద్ ఉల్ నబీ పండుగ వేడుకలు జరుపుకోవాలని శంషాబాద్ ఎసిపి రాంచందర్ రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన నందిగామలో రైతువేదిక భవనంలో గురువారం సాయంత్రం మండలంలోని అన్ని గ్రామాల గణేష్ మండపాల నిర్వాహాకులతో శాంతి సమావేశాన్ని సర్కిల్ ఇన్స్ పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎసిపి గణేష్ మండపాల నిర్వాహాకులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు...రానున్న పండుగల్లో అందరూ శాంతియుతంగా ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలన్నారు. గణేష్ నిమజ్జనం , మిలాద్ ఉన్‌నబి వేడుకలు ఒకే రోజు వచ్చాయని మతసామరస్యం, సోదరా భావంతో శాంతియుతంగా సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండప నిర్వాహకులు ప్రతీమలు ఏర్పాటు చేసే ముందు అన్ని రకాల చర్యలు షేడ్ నిర్మాణం, నాణ్యత ,కరెంటు సౌకర్యం, సిసి కెమెరాలు, ప్రజలకు వాహనదారులకు ఎలాంటి ఆసౌకర్యం కాకుండా మండపాలు రోడ్డు తల గురించి వివరించారు. ఈ సంవత్సరం ఏర్పాటు చేసే గణేష్ మండప సమాచారాన్ని సంబంధిత పోలీసు అధికారులకు తప్పకుండా తెలియజేయాలని కోరారు. ప్రతి మండపం వద్ద పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేయడం జరుగుతందని పోలీసు అధికారులు, బ్లూ కోల్ట్ అధికారులు తరుచూ తనఖీ చేయడం జరుగుతుందన్నారు. మండపాల్లో గాని, నిమజ్జనం రోజు గాని డిజేలకు అనుమతి లేదని, ఎలాంటి అనుమతి లేకుండా డిజెలను ఏర్పాటు చేసుకున్నట్లయితే వారిని బైండోవర్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్, ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ, చంద్రాపాల్ రెడ్డి, దేపల్లే కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ మేక్కొండ కుమార్ గౌడ్, స్థానిక ఎస్సై గోపాల కృష్ణ, ఆయా గ్రామాల నుండి వచ్చిన గణేష్ మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులు ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బాధ్యులకు బదిలీలలో పాయింట్స్ ఇవ్వాలి

**- పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్**



ఉపాధ్యాయులతో సభ్యత నమోదు చేయిస్తున్న యూనియన్ ఉపాధ్యాయులు

**మహేశ్వరం, సెప్టెంబర్ 15, (ప్రభాతవార్త) :** యూనియన్ బాధ్యులుగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు తమ కుటుంబ బాధ్యతలను కూడా పక్కన పెట్టి ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య వారధిగా పనిచేస్తూన్న యూనియన్ బాధ్యతలకు తగిన గుర్తింపు ఇచ్చి బదిలీలలో పాయింట్స్ ఇవ్వాలని పీఆర్టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మహేశ్వరం మండల పరిధిలోని పీఆర్టీయూటీఎస్ సభ్యత నమోదు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జడ్పీహెచ్ఎస్ అమీర్పేట్, జడ్పీహెచ్ఎస్ బాలికల అమీర్పేట్, జడ్పీహెచ్ఎస్ సుభాన్పూర్, జడ్పీహెచ్ఎస్ కోళ్ల పడకల్, యూపీఎస్ దుబ్బచర్ల, మాణిక్యమ్మగూడ, పీఎస్, పీఎస్ పెండ్యాల, యూపీఎస్ కల్వకోల్ తదితర పాఠశాలలో ఉపాధ్యాయుల సభ్యత నమోదు చేయించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ మాట్లాడుతూ... 365 రోజులు ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం నాయకులకు బదిలీలలో పాయింట్స్ ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఇప్పుడు జరుగుతున్న బదిలీలలో ప్రమోషన్లలో ఉపాధ్యాయులందరూ ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సమాచారాన్ని ఒక్కసారి క్షుణ్ణంగా పరిశీలించి జాబితాలను విడుదల చేయాలని ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా డీఈఓను తమ యూనియన్ పక్షాన కోరారు. ఎన్నో సంవత్సరాలుగా వేచిస్తున్న ప్రమోషన్లు, బదిలీలు ఇప్పుడు జరుగుతున్నందున ప్రతి ఉపాధ్యాయుడు సహకారిస్తు బదిలీలు, ప్రమోషన్లు పొంది ముందుకు సాగుదామని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి జానకీ రామ్‌నాయక్, అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, రాష్ట్ర బాధ్యులు ఆనంద్, బాలిశ్వర్, నర్సింగ్‌రావు, మహేశ్, పాండు తదితరులు ఉన్నారు.

# స్వార్థంతోనే ఎమ్మెల్యేపై ఎంపిపి విష ప్రచారం : జంతుక కిరణ్



విలేకరులతో మాట్లాడుతున్న జంతుక కిరణ్

**ఆమనగల్లు, సెప్టెంబర్15, ప్రభాతవార్త:** కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్‌పై ఆమనగల్లు ఎంపీపీ అనితవిజయ్ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నేత జంతుక కిరణ్ అన్నారు. ఎంపీపీ అనిత వ్యాఖ్యలు అధిష్టాన నిర్ణయాన్ని తప్పుబట్టడమేనని, పెద్దల నిర్ణయాన్ని తప్పుబట్టేంత స్థాయి ఎంపీపీ అనితకు లేదని ఆయన మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ దళిత విభాగం నేతలతో కలిసి జంతుక కిరణ్ విలేకరుల సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యేపై ఎంపీపీ అనిత చేసిన ఆరోపణలకు బదులుగా మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయాన్ని దిక్కరించే స్థాయి ఏ ప్రజాప్రతినిధులు, నాయకులకు లేదన్నారు. ప్రజాభిప్రాయాలు, సొంత సర్వేల ఆధారంగానే బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం రాష్ట్రంలో గెలుపు గుర్రాలకు టిక్కెట్లు కేటాయించిందన్నారు. అందులో కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ఒకరని జంతుక కిరణ్ తెలిపారు. సొంత పార్టీ ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారాలు చేస్తూ పార్టీ ప్రతిష్టతకు దెబ్బతీయడం పాలుత్రాగి రొమ్మును గుద్దిన చంధంగా ఉందని కిరణ్ ఘాటుగా విమర్శించారు. ఎంపీపీ అనిత స్వార్థంతోనే ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారానికి దిగుతుందన్నారు. పార్టీలో పనిచేయని వ్యక్తులను ప్రోగు చేసుకుని ప్రజలను తప్పుద్రోవ పట్టించేందుకు ప్రజాధరణ కల్గిన జైపాల్‌యాదవ్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల లో బీఆర్ఎస్ పార్టీ గెలుపును కాంక్షిస్తే చిత్తశుద్ధితో పార్టీకి ప్రతిఒక్కరూ పనిచేయాలని ఆయన హితవు పలికారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు, విష ప్రచారాలకు పాల్పడితే పార్టీ పరంగా తగిన బుద్ధి చెబుతామని జంతుక కిరణ్ హెచ్చరించారు. కార్యక్రమంలో బైండ్ల వంకేశ్వరం భీమయ్య, కాలే విక్రమ్, వస్పుల రంజిత్, కొమ్ము ప్రసాద్, ఎండి అబ్బు, ఎండి అప్సర్, గుండమల్ల రాములు, వస్పుల శ్రీరామ్, రేవని విజయ్, ఎండి పాష తదితరులు ఉన్నారు.

## చంద్రబాబునాయుడు అరెస్టు అప్రజాస్వామికం





చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న కమ్మ సేవా సమితి సభ్యులు, రాజకీయ నాయకులు

**- షాద్‌నగర్‌లో నిరసనగా భారీ సంఘీభావ ర్యాలీ**
**- పార్టీలకు అతీతంగా హాజరైన నాయకులు, ప్రముఖులు**

**షాద్‌నగర్, సెప్టెంబర్ 15, (ప్రభాతవార్త) :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని షాద్‌నగర్ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిరసనగా శుక్రవారం భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. షాద్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం సమీపం వరకు చేపట్టిన ఈ ర్యాలీలో పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా కమ్మ సేవ సమితి అధ్యక్షుడు పాతూరి వెంకట్‌రావు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ కేవలం కక్ష్య సాధింపు కోసమే చంద్రబాబునాయుడుని అరెస్టు చేయించారని ఆయన మండిపడ్డారు. చేతనైతే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ ఇలా అక్రమ కేసులు పెట్టిన సునకానందం పొందడటం సమాంజసం కాదని ఆయన ఆయన హెచ్చరించారు. ఇకనైనా వెంటనే చంద్రబాబునాయుడిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ర్యాలీలో మహిళలు, నాయకులు ముఖ్యమంత్రి జగన్ డౌన్ డౌన్ అంటూ, చంద్రబాబునాయుడు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, కమ్మ సేవా సమితి సభ్యులు పినపాక ప్రభాకర్, గుదే వసంతరావు, మలినేని శ్రీను, పాతూరి బ్రహ్మయ్య, పాతూరి సత్యనారాయణ, మక్కపాటి మల్లేశ్వరరావు, కంకల శ్రీను, సత్యనారాయణ, జొన్నలగడ్డ శ్రీను, నువ్వుల రమేష్, యడ్ల శ్రీను, కమ్మ మహిళా సేవా సమితి సభ్యులు పాతూరి హైమావతి, పినపాక మంగాదేవి, పాతూరి ఇంద్రాదేవి, నువ్వుల రమాదేవి, నువ్వుల శ్రీలత, పాతూరి ఉదయ లక్ష్మీ, మలినేని శివకుమారి, పాతూరి స్వాతి, కుకుట్ల సుజాత, పాతూరి అరుణ, అంజలి, అనురాధ, మాక్కపాటి లక్ష్మీ, గుదేరాణి, బీఆర్ఎస్ నాయకులు కానుగ అనంతయ్య, శ్రీశైలంగౌడన, పాండురంగారెడ్డి, శ్రీను, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, కార్మికులు, అభి మానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ నియామ పత్రాలు అందజేత

**తలకొండపల్లి సెప్టెంబర్15,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలానికి చెందిన 13మంది జేపిఎస్ పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులర్ చేస్తూ నియామకపు ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జడ్పిచైర్‌పర్సన్ అనిత హరినాథ్ రెడ్డి, ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్ ద్వారా 13మందికి ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత జ్యోతయ్య, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్, మండల పరిషత్ అధికారి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

## ఇంటి నిర్మాణానికి ఐక్యత సహాయం

**ఆమనగల్లు, సెప్టెంబర్15, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు మదనాపురం వెంకటయ్య ఇంటి నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. వెంకటయ్య మృతి చెందినప్పుడు ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఇంటి నిర్మాణానికి సహకరిస్తానని హామి ఇచ్చారు. ఈమేరకు ఫౌండేషన్ రూ. 25వేల సమకూర్చగా ఫౌండేషన్ ప్రతినిధుల చేత ఆర్థిక సహాయం అందజేసింది. ఈసందర్భంగా లబ్దిదారులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## పోస్టల్ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి : పిఎంజి శ్రీలత

**కందుకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ అయిన పోస్టల్ డిపార్ట్‌మెంట్ దేశంలో ఎంతో నమ్మకమైనదని మారు మూల ప్రాంతాలకు విస్తురించి ఉన్నదని ఈ సంస్థ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందాలని పిఎంజి శ్రీలత పేర్కొన్నారు. శుక్రవారం కందుకూరుమండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో పోస్టల్ శాఖ వారు నిర్వహించిన పోస్టల్ మెగామేళా కార్యక్రమానికి ముఖ్య అథిదిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఉపయోగ పడే అనేక రకాల సేవా పతకాలను పోస్టల్‌శాఖ అందిస్తుందన్నారు. 399 రూపాయలు చెల్లిస్తే 10 లక్షల రూపాలయ విలువైన ప్రమాదభీమా అందిస్తుందని, వారి కుటుంబంలోని చిన్నారికి 2 లక్షల విద్యానిది అందించడం జరు గుతుందన్నారు. సుకన్యా పథకం, మహిళాసమ్మాన్ యోజన, పిఎల్ఐ, అర్‌పిఎల్ఐ వంటి అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలనిఈ విషయంలో ప్రజలను చైత న్యం చేయాని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌పి టివిశర్మ, ఎఎస్‌పిలు చలపతి, సిద్దార్థ్, నవీన్, ఎడి నరేంద్ర, ఎంపిపి మందజ్యోతి, వైస్‌ఎంపిపి శమంతప్రభాక్‌రెడ్డి సర్పంచ్ శమంతకమని సిబ్బంది తోపాటు ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు. త





పోస్టల్ మెగా మేళాలో మాట్లాడుతున్న పిఎంజి శ్రీలత

## కొడంగల్ నియోజకవర్గంపై నిర్లక్ష్యం తగదు

**-విద్యావంతుల వేదిక తాలూకా అధ్యక్షులు ముత్యప్ప**

**కొడంగల్, సెప్టెంబర్ 15ప్రభాతవార్త**

కొడంగల్ నియోజకవర్గ కేంద్రాన్ని నిర్లక్ష్యం చేయకుండా భవిష్యత్తులో కొడంగల్‌లో జిల్లా వ్యాప్తంగా జరిగే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసేలా రాష్ట్రవిద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్‌లు తగు చర్యలు తీసుకోవాలని విద్యావంతుల వేదిక కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షులు ముత్యప్ప, ప్రధాన కార్యదర్శి గౌరారం గోపాల్‌లు కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతు టెట్ పరీక్షా కేంద్రాలను కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయక పోవడం వల్ల కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్ మండలాలకు చెందిన టెట్ పరీక్ష రాసే విద్యార్థులు సుదూర ప్రాంతాలైన పరిగి, తాండూర్, మహబుబ్‌నగర్‌లలో రాయవలసి రావడం విచారకరమన్నారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో విశాలమైన గదులు కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పాటు ప్రైవేట్ కళాశాలలు ఉన్నప్పటికి జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. ఆర్థికంగా ఇబ్బందులతో దూర ప్రాంతాలలో పరీక్షలు రాయవలసి వస్తున్నదన్నారు. గతంలో కూడా టెట్ పరీక్షా కేంద్రాలను కొడంగల్‌లో ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా అధికారులకు విన్నవించుకున్నప్పటికి జిల్లా అధికారులు కొడంగల్ నియోజకవర్గ కేంద్రం పట్ల చిన్నచూపు చూడడం తగదని భిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా ఏ పరీక్షలను నిర్వహించినా కొడంగల్‌లో సంభందిత పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విద్యావంతుల వేదిక సభ్యులు వెంకటేశం, అశోక్‌కుమార్ తదితరులున్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు

**దౌల్తాబాద్, సెప్టెంబరు 15 ప్రభాత వార్త:** మండల పరిధిలోని ఊరగుంట తండాకు చెందిన కాంగ్రెస్, వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం కొడంగల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారిని పార్టీ కండువాలతో ఎమ్మెల్యే ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో వార్డు సభ్యులు హనుమనాయక్, గోవింద్‌నాయక్, అనిల్‌నాయక్, సుభాష్‌నాయక్, నరేశ్, వెంకటప్ప, మాణిక్యప్ప, శీను నాయక్, పెంట్యా నాయక్, రాజేందర్, శివకుమార్, నరేశ్, రాజు, గోపాల్, నర్సిములు, వెంకట్‌తో పాటు పలువురు ఉన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

# ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



**తలకొండపల్లి సెప్టెంబర్15,ప్రభాతవార్త :** పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తలకొండ పల్లి మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ పూలే మాదిగ మాట్లాడుతూ....బిజెపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధ త కల్పించి మాదిగలకు న్యాయం చేస్తామని ప్రలోభాలు పలికిన కేంద్ర ప్రభుత్వం మాట తప్పి మాదిగలను నమ్మించి గొంతు కోసే విధంగా వ్యవహరించడం సరైనది కాదని ఇప్పటికైనా మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మాదిగలకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ జిల్లా సెక్రటరీ కిరణ్ పూలే, ఎమ్మార్పిఎస్ సీనియర్ నాయకులు పోతుగంటి యాద య్య, వెలుగు శ్రీశైలం, బైండ్ల నర్సింహ, పడకల్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం, చీపునుంతలా గ్రామ ప్రధాన కార్యదర్శి విజయ్ ,ఎమ్మార్పి ఎస్ నాయకులు శ్రీశైలం బబ్బులు, కిరణ్, ప్రహ్లద్ ,మహేష్, వంశీ, మల్లేష్, రమేష్, గణేష్, సందీప్, సురేష్, శశికాంత్, పోచయ్య, పాల్గొన్నారు.

## ఉత్తమ గ్రామపంచాయతీగా సుల్తాన్‌పల్లి ఎంపిక





**శంషాబాద్ సెప్టెంబర్15,ప్రభాతవార్త :** ఉత్తమ గ్రామ పంచాయతీగా సుల్తాన్‌పల్లి గ్రామాన్ని అధికారులు ఎంపిక చేసి గ్రామ సర్పంచ్ దండు ఇస్తారికి అవార్డును అందజేశారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శంషాబాద్ మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలు ఎన్నిక కాగా అందులో సుల్తాన్‌పల్లి ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు లభించింది. గ్రామ సర్పంచ్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దండు ఇస్తారిని సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జడ్పిచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ,ఎంపిపి జయమ్మ శ్రీనివాస్, ఎంపిటిసి సంగీత ,వార్డు సభ్యులు శ్రీశైలం, మాల కృష్ణ, గ్రామ కార్యదర్శి ప్రదీప్ కుమార్ స్థానిక నాయకులు ఎలాగని ప్రభాకర్ గౌడ్ ,మైలారం రాజు పాల్గొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఉత్తమ పంచాయతీ అవార్డు ఆందుకోవడానికి సహకరించిన స్థానిక శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్, ఎంపిపి జయమ్మ శ్రీనివాస్, జడ్పిటిసి నిరటి తన్విరాజు ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రారెడ్డికి సర్పంచ్ దండుఇస్తారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## చిన్న గొల్లపల్లి మున్సిపల్ కార్మికులకు దుస్తులు అందజేత



**శంషాబాద్ సెప్టెంబర్15,ప్రభాతవార్త :** తడి ,పొడి చెత్త సేకరణ కార్యక్రమంలో చిన్న గొల్లపల్లి వార్డును పైలెట్ ప్రాజెక్ట కింద ఎంపిక చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ చెన్నం అశోక్ తెలిపారు. పారిశుధ్య విభాగంలో గొల్లపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని ఈ ప్రాంతానికి ప్రత్యేకంగా చెత్త తరలించేందుకు ఆటోను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం మున్సి పల్ సిబ్బందికి దుస్తులు రెన్ కోటు, పిపి కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు లక్ష్మయ్య, దుర్గా రావు, తదితరులు పాల్గొన్నారు..

# కాంగ్రెస్ విజయభేరికి తరలిరండి

**-రంగాపూర్ కాంగ్రెస్ నేతల పిలుపు**



కాంగ్రెస్ విజయభేరిని విజయవంతం చేయాలని పిలుపునిస్తున్న రంగాపూర్ కాంగ్రెస్ నాయకులు

**నందిగామ సెప్టెంబర్15,ప్రభాతవార్త :** ఈనెల 17వ తేదిన మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో రాజీవ్ గాంధీ ప్రాంగణంలో జరగనున్న కాంగ్రెస్ విజయభేరీ భారీ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని రంగాపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల జ్ఞానేశ్వర్, మండల కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు పాత్లవత్ శ్రీను నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవాబ్ పేట రవిందర్ గౌడ్, డైరెక్టర్ రూప్‌సింగ్, నాగేందర్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయడానికి ,అలాగే గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు యొక్క అవశ్యకతను వివరించనున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకోవటానికి మండలంలో నుండి అత్యధిక సంఖ్యలో అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ విజయ భేరి సభకు అఖిలభారత కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీతో పాటు ఏఐసిసి అధ్యక్షుడు మల్లీఖార్జున ఖార్గె, కాంగ్రెస్ అగ్రశేణి నేతలు హాజరవుతారని పేర్కొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రారంభోత్సవానికి పెద్దసంఖ్యలో తరలిరావాలి : జెడ్పిటిసి

**కందుకూరు, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల ప్రారంబోత్సవ కార్యక్రమానికి మండల ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాయంలోని జెడ్పిటిసి చాంబర్‌లో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు యం జయేందర్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకృష్ణానదిపై ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం దక్షినతెలంగాణ ప్రాంత ప్రజలకు వరప్రదాయనిగా నిలుస్తుందన్నారు. బహిరంగ సభకు పెద్దసంఖ్యలో పాల్గొని బిఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చేర్మెన్ ఎస్ సురేందర్‌రెడ్డి, నియోజకవర్గం బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు జి లక్ష్మి నర్సింహ్మారెడ్డి, పిఎసిఎస్ చేర్మెన్ డి చంద్రశేఖర్, ఎంపిటిసికె రాములు, యాదయ్య, శేఖర్, క్రిష్టారెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పిటిసి

# కాంగ్రెస్ గెలుపే ప్రధాన లక్ష్యం .!

- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలను చిత్తుచిత్తుగా ఓడిస్తాం..
- ఉమ్మడి జిల్లాలో 14అసెంబ్లీ స్థానాలు గెలుపే టార్గెట్
- 17న సోనియమ్మ సభను విజయవంతం చేద్దాం
- మాజీ మంత్రి చెన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే.లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెన్నారెడ్డి

**తాండూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీ గెలుపే మా ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి చెన్నారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చనగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరులోని పార్టీ కార్యాలయంలో ఈ నెల 17న హైదరాబాద్‌లోని మహేశ్వరం తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి చెన్నారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎన్నికల పార్లమెంట్ ఇంచార్జ్ సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తాండూరు ఇంచార్జ్ రమేష్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఏ హామి ఇచ్చిన అమలుచేసి తీరుతుందని అన్నారు. వచ్చే ఎన్నిల్లో కాంగ్రెస్ పార్టీని ఎందుకు గెలిపించాలో తెలిపేందకు 5 గ్యారంటీ సంక్షేమ పథకాలతో ఈ నెల 17న తుక్కుగూడలో జయభేరి బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభావేధికగా కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ప్రజల ముందు ప్రకటించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు రాహూల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో పాటు దేశంలోని కాంగ్రెస్ పార్టీ అతిరథులు, పాల్గొంటున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి పార్టీ పిరాయించిన 12మంది ఎమ్మెల్యేలను చిత్తుచిత్తుగా ఓడించడమే లక్ష్యమని అన్నారు. తాండూరులో కాంగ్రెస్ పార్టీ నుండి ఎవరు నిలబడినా ప్రచారానికి నేనే వస్తానని.. కాంగ్రెస్ పార్టీ నాయకులను, ఓటర్లను మోసం చేసి పార్టీ పిరాయించిన ఈ తాండూరు పోరగాన్ని చిత్తుచిత్తుగా ఓడిస్తామని ఘాటుగా విమర్శించారు. తనకు తాండూరు టిక్కెట్ ముఖ్యం కాదని కాంగ్రెస్ పార్టీ గెలుపే ముఖ్యమని చెప్పుకొచ్చారు. మరోవైపు ఈ నె17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరీ సభను విజయవంతం చేయాలని తెలిపారు. తాండూరు నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. 16న సీడబ్ల్యూసీ సమావేశం ఉంటుందని, 17న జయభేరీ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయభేరీ సభ అనంతరం తాండూరుకు ఇతర రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి లేదా సీఎల్పీ, సీడబ్ల్యూసీ సభ్యులు రానున్నట్లు వెల్లడించారు.. 17న రాత్రి తాండూరులోని బసచేయనున్నారన్నారు. 18న తాండూరులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారెంటీ పథకాలపై వివరించనున్నట్లు తెలిపారు. పార్టీ ప్రకటించనున్న గ్యారెంటీ పథకాలను ఇంటింటికి చేరవేసేలా క్షేత్రస్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ జెడ్పిటీసీ ధారాసింగ్, సీనియర్ నాయకులు ఉత్తంచంద్, ధారాసింగ్, పి.బస్వరాజ్, చెనిమిళ్ల మల్లన్న, ఆలీం, కోర్వార్ నగేష్, పట్టణ అధ్యక్షులు హబీబ్ లాల, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మధుబాల, కౌన్సిలర్ మమత తదితరులు పాల్గొన్నారు.

**విజయభేరీ భారీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం**
**-మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్ కుమార్, చిన్నారెడ్డి**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్‌కుమార్, చిన్నారెడ్డి

**వికారాబాద్,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని తుక్కుగూడలో 17న జరిగే విజయభేరీ భారీ బహిరంగ సబను విజయవంతం చేయాలని మాజీ మంత్రులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు గడ్డం ప్రసాద్‌కుమార్, చిన్నారెడ్డిలు పిలుపునిచ్చారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసంలో ఈ నెల 17న జరిగే విజయభేరీ సభ సన్నహక కార్యక్రమంలో భాగంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ వస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ తుక్కుగూడ లో విజయభేరీ సబను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, యువ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, నాలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, దేశంలోని అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు ముఖ్యాతిథులుగా వస్తున్నారని తెలిపారు. 16న సీడబ్ల్యూసీ కార్యక్రమం ఉంటుందని, 17న సాయంత్రం విజయభేరీ సభ, 18న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశం ఉంటుందని తెలిపారు. విజయభేరీ సభకు జన సమీకరణ చేయాలని, ఒక్కొక్క నియోజకవర్గ నుంచి పదివేల మందిని తరలించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇచ్చే సంక్షేమ పథకాలతో పాటు బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అన్యాయాలను తిరగబడదాం..తరిమికొడదాం అనే నినాదంతో ప్రతి ఇంటికి చేరాలని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, వికారాబాద్ మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు కిషన్ నాయక్, సామ రాంచంద్రా రెడ్డి, రత్నారెడ్డి, నర్సింలు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## దళితబంధు ఇవ్వాలని గ్రామపంచాయతీ ఎదుట ధర్నా



**పరిగి సెప్టెంబర్15,ప్రభాతవార్త :**
పరిగి మండలం మిట్టకోడూర్ గ్రామంలో శుక్రవారం అర్హులైన వారికి దళితబంధు పథకం ఇవ్వాలని గ్రామపంచాయతీ వరకు ర్యాలీగా వెళ్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి పరిగి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా సిపిఐ పార్టీ,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ... దళిత బంధు పథకం అర్హులైన వారికి ఇవ్వకుండా వారి పార్టీ లీడర్లకు కార్యకర్తలకు కమిషన్ ఇచ్చే వారికి దళితబంధు పథకం ఇస్తున్నారన్నారు.అర్హులైన వారికి దళిత బంధు పథకం ఇవ్వకపోతే పెద్ద ఎత్తున సిపిఐ పార్టీ,దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దళితులలు మణిక్యం యాదయ్య,ప్రభు,రాంచెంద్రయ్య,భేమయ్య,రాజు లక్ష్మి, నాగమణి,అనిత రాజు,బందెయ్య,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బిసిలకు 60 ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలి

-జిల్లాలో బిసిలకు కనీసం రెండు టికెట్లు కేటాయించాలి : ఈడిగ శ్రీనివాస్



మాణిక్ రావు ఠాక్రేను కలిసిన శ్రీనివాస్ గౌడ్

**తాండూరు టౌన్ సెప్టెంబర్15, ప్రభాతవార్త :**
త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బిసిలకు సముచిత స్థానం కల్పించి 60 ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వాలని వికారాబాద్ జిల్లాలో కనీసం రెండు స్థానాలు బిసిలకు కేటాయించాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మాణిక్ రావు ఠాక్రేను హైదరాబాద్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బిసి యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ కలిసి కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మొదటి నుంచి బిసిలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారని గుర్తు చేశారు.మొన్న సిఎం కెసిఆర్ ప్రకటించిన బిఆర్ఎస్ టికెట్ జాబితాలో బిసిలకు మొండి చేయి చూపడం జరిగిందని వికారాబాద్ జిల్లాలో ఒక్కరంటే ఒక్కరికి కూడా బిసిలకు టికెట్లు ఇవ్వకుండా అవమానించిందని కాబట్టి బిఆర్ఎస్ పార్టీని సాకుగా చూపించి కాంగ్రెస్ పార్టీ బిసిలకు అన్యాయం చేయొద్దని కాంగ్రెస్ పార్టీ అధిక శాతం బిసిలకు టిక్కెట్లు ఇచ్చి బిసిల పార్టీ అని నిరూపించుకోవాలని కోరారు.బిసిల సమస్యలు అన్ని విని సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా బిసిలకు ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో న్యాయం చేస్తానని మాణిక్ రావు ఠాక్రే రావు హామీ ఇచ్చారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు



**తాండూరు టౌన్ సెప్టెంబర్15,ప్రభాతవార్త :**
తాండూరు పట్టణంలో ఐదు రోజులుగా సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న నిరసనకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి గౌరవ వేతనం నెలకు 26 రూపాయలు అందించాలని వారి ప్రతి డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్,యువజన కాంగ్రెస్ నియోజకవ్గ ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్,మైనార్టీ నాయకులు జలాల్ భాయ్,సమద్, సమీ పట్టణ ఉపాధ్యక్షుడు నారా అశోక్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంజన్న,సురేష్,నసీర్ వడ్డే శ్రీనివాస్,యువజన కాంగ్రెస్ నాయకులు రాజు గౌడ్,అంతరం శ్రీనివాస్,బలరాం, గోవింద్,పాల్గొన్నారు.

## తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

**-మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**



పెద్దేముల్‌లో పూజలు నిర్వహిస్తున్న కెఎల్ఆర్

**పెద్దేముల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:**
రానున్న ఎన్నికలలో బిఆర్ఎస్‌ను చిత్తుచిత్తుగా ఓడించి తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని శంభులింగేశ్వర దేవాలయంలో మాజీ మంత్రి చిన్నారెడ్డితో కలిసి కేఎల్ఆర్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తాండూరు అసెంబ్లి టికెట్ ఎవరికి ఇచ్చిన కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు.కార్యకర్తలు సమిష్టి కృషితో పనిచేస్తే అంతిమ విజయం మనదేనని అన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచి బిఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలను తుక్కుతుక్కుగా ఓడిస్తామని శపథం చేసారు. కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శోభారాణి, మైనార్టీసెల్ కన్వీనర్ రియాజ్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు నసీర్,మాజీ యంపిటిసి డాక్టర్ రమేష్, న్యాయవాది ఎల్లారెడ్డి, మీనాజ్, డివైనర్సిములు, గోపాల్, అనంతచారీ మంబాపూర్ గ్రామ కమిటి అధ్యక్షులు మైపూస్, మల్లప్ప, పెంటప్ప, ఎక్బాల్, నాగిరెడ్డితదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా టిడిపి

**చౌడపూర్ సెప్టెంబర్15,ప్రభాతవార్త :**
మండల కేంద్రానికి చెందిన మొగిలిగిద్ద ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది.నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి,పరిగి టిడిపి ఇంచార్జీ కాసాని వీరేష్ అందుబాటులో లేకపోవడంతో తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.నిరుపేద ప్రజలకు అండగా టిడిపి పార్టీ ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కాసాని యువసేన సభ్యులు రామస్వామి,శేఖర్,సాయి,క్రిష్ణయ్య,మల్లేష్,శ్రీనివాస్ రెడ్డి,క్రిష్ణ,పవన్ టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీబసవలింగేశ్వర స్వామి మహారుద్రాభిషేకం

**-నిరంజన మఠంలో శ్రావణమాస ముగింపు వేడుకలు**



భక్తులకు ప్రవచనాలు అందిస్తున్న మఠం పీఠాధిపతి

**కొడంగల్,సెప్టెంబర్ 15ప్రభాతవార్త**
కొడంగల్ పట్టణంలోని శ్రీ.జగద్గురు నిరంజన మఠంలో వైభవంగా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అద్వర్యంలో శ్రావణమాస ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు.శ్రావణమాస పాఢ్యమి మొదలుకొని శ్రావణ బహుళ చతుర్దశి వరకు నెల రోజుల పాటు నిత్య రుద్రాభిషేకం నిర్వహించగా శుక్రవారం మహహ రుద్రాభిషేకంంతో ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.శ్రీనిరంజన మఠంలో శ్రీబసవలింగేశ్వర స్వామివారికి మఠాధిపతులు డాక్టర్ సిద్దలింగేశ్వర మహాస్వామి సమక్షంలో పూజారులు మఠం విజయ్‌కుమార్, గడ్డం చంద్రశేఖర్,సాయిగణేష్,మహేష్‌స్వాములు శాస్త్రోక్త మంత్రోచ్ఛరణలతో మహ రుద్రాభిషేకం,అర్చన,అష్టోత్తర శతనామావళితో బిల్వ దళాలతో స్వామివారికి అర్పిస్తు విశేష అలంకరణ చేశారు.శివాష్టకం,బిల్వాష్టకం,లింగాష్టకం,పంచాక్షరీ స్తోత్రం,దూప,దీప నైవేద్యాలను సమర్పిస్తు మంగళహరతులు అందించారు. అనంతరం ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్,మున్సిపల్ చెర్మెన్ జగదీశ్వర్‌రెడ్డిల అద్వర్యంలో ఆలయం చుట్టూ పల్లకి సేవా నిర్వహించారు.స్వామివారి పల్లకి సేవ ముందు ఖడ్గాలు వేస్తు స్వామివారిని వేడుకుంటూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ బాల్‌రాజ్,వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరిలో ధర్మం ఉట్టి పడాలిః నిరంజన మఠం పీఠాధిపతులు**
సమాజంలో ప్రతి ఒక్కరు ధర్మాన్ని పాటిస్తూ దైవారాధన చేయడంతో సాధ్యం కానిది ఏదీ ఉండదని శ్రీజగద్గురు నిరంజన మఠం పూజ్యశ్రీ డాక్టర్ సిద్దిలింగ మహాస్వామి అన్నారు.శుక్రవారం పట్టణంలోని నిరంజన మఠంలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సభ్యుల అద్వర్యంలో నిర్వహించిన శ్రావణమాస ముగింపు వేడుకల్లో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.శ్రావణ మాసం ఎంతో పవిత్రమైందని,నిర్మలమైన మనస్సు,శక్తితో దైవారాదన చేయడం వల్ల శక్తి సామర్థ్యాలు పెరుగుతాయన్నారు.శ్రావణ మాసం అంటే వినడం,భక్తితో అచరించడం వల్ల మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని,తద్వారా ఆరగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు.వీరశైవులు ప్రతినిత్యం లింగపూజ చేసుకోవాలని, దర్మంగా నడుచుకోవడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు.అనంతరం వక్తలు పోలె విశ్వనాథం,రాజశేఖరస్వామిలు వీరశైవం గురించి వివరించారు.అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ జంగమ సమాజం కార్యవర్గ సభ్యులను ఎంపీపీ సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు మల్లిఖర్జున స్వామి,ఎం. అంపయ్య స్వామి,వినయ్‌కుమార్‌స్వామి,విజయ్‌కుమార్,శ్రీశైలం,రాజయ్య,మరపతి జగదీశ్వర్,శాంతుకుమార్‌లతో పాటు కర్నాటకలోని జాకన్‌పల్లి మఠాధిపతులు సిద్దిలింగేశ్వర స్వామి,సేడం మఠాధిపతులు అరవయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ కార్యకర్తలు



**ధారూర్ సెప్టెంబర్15,ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది.మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన బిజెపి,బిఆర్ఎస్ కార్యకర్తలు,నాయకులు శుక్రవారం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే మహేష్ రెడ్డి



**చౌడపూర్ సెప్టెంబర్15,ప్రభాతవార్త :**
చౌడపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడపడుచులకు కొండంత ధైర్యాన్ని ఇస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.రైతుబంధు,రైతుబీమా ,దళిత బంధు,బిసి బంధు లాంటి ఎన్నో పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని వచ్చే ఎన్నికల్లోను బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 63మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,తహసీల్దార్ ప్రభులు,జడ్పిటిసి రాందాస్,పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాగరాజు,సీనియర్ నాయకులు రంగారెడ్డి,శివకుమార్,మఠం రాజశేఖ ర్, వెంకట్,శివుడు,పాండురంగయ్య,వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

-ప్రగతి నివేదికలు చదువు వినిపించిన అధికారులు
-సమయపాలన పాటించని పలు శాఖ అధికారులు
-గంటన్నరలో ముగిసిన సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధి

**ధారూర్ సెప్టెంబర్15,ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపిపి విజయలక్ష్మి హనుమంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు,తదితర అంశాలపై ప్రతి మూడు నెలలకొసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది.పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సమావేశం ప్రారంభమయ్యాక కూడా అధికారులు,ప్రజాప్రతినిధుల కారక కొనసాగింది.పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదవి వినిపించారు.నర్సరీలలో మొక్కలు ఉండగా,వేరే మొక్కలను డబ్బులు పెట్టి తేవడంపై కుమ్మరిపల్లి సర్పంచ్ ఏపిఓను ప్రశ్నించారు.మొక్కలకు సంబంధించి డబ్బులు ఇప్పటి వరకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మొక్కల పరిమాణంలో లేకపోవడంతో వేరే మొక్కలు తెంపించడం జరిగిందని ఏపిఓ తెలిపారు.మోమిన్ కాలన్ గ్రామంలో ట్రాన్స్‌పార్మర్ వద్ద ఆన్ ఆఫ్‌లో లేదని,పొలాల్లో విద్యుత్ తీగల చేతికి అందేలా ఉన్నాయని సర్పంచ్ ఏఈని ప్రశ్నించారు.వెంటనే ఆన్ ఆఫ్‌లో పెట్టించి విద్యుత్ తీగలను గుర్తించి సమస్యలను పరిష్కరిస్తాను అని ఏఇ అన్నారు.పశువైద్య శాఖ అధికారులు ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వట్లేదు అని పలుమార్లు ఫోన్లు చేసిన పట్టించుకోవడంలేదని ఎంపిటిసిలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పలు శాఖల అధికారులు పూర్తయిన పనుల వివరాలు తెలిపారు.పెండింగ్‌లో ఉన్న పనులను వీలైనంతవరకు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ....సంక్షేమ పథకాలు అర్హులైన వాళ్లందరిని అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.అలాగే అధికారులు తొందరగా పెండింగ్‌లో ఉన్న పనుల ను పూర్తి చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో జడ్పిటిసి సుజాత వేణుగోపాల్ రెడ్డి,ఎంపిడివో చంద్రశేఖర్,వైస్ ఎంపిపి విజయ్,పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి,సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనార్టీ నాయకులు



**చౌడపూర్ సెప్టెంబర్15,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని మందిపాల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి సమక్షంలో,చౌడాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొన్ని సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీలో ఉన్నా..తమకు న్యాయం జరగలేదంటూ కాంగ్రెస్ పార్టీతోనే తమకు న్యాయం జరుగుతుందని మైనార్టీ నాయకులైన ఎండి రషీద్,ఖాజాపాష,మన్సూర్,దస్తగిరి,జాంగిర్,తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు,యువ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**-జిల్లా అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్**

**వికారాబాద్,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:**
18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని శ్రీ అనంత పద్మనాభ డిగ్రీ కళాశాల, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, పూడూరు మోడల్ స్కూల్ లలో ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యత, నైతిక ఓటింగ్ పై విద్యార్థులకు అవగాహనతో పాటు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యతను తెలిపేలా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. 18 ఏండ్లు నిండిన యువత వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లు సైతం నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండే వారు వారి పేరును ఈ నెల 19 లోగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పేర్లు, చిరునామా మార్పులకు సంబంధిత ఫారాలు పూరించి బిఎల్ఓ లకు, తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. ఓటరుగా నమోదుతో పాటు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి కోటాజి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్

## అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**-సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ నిరసన**



కొడంగల్ ఐసీడీఎస్ కార్యాలయ సమీపంలో సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

**కొడంగల్,సెప్టెంబర్ 15ప్రభాతవార్త**
అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్ధానిక ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో సీఐటీయూ అద్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.హెల్పర్లకు రూ.5లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని,మినీ అంగన్‌వాడీలను మేన్ అంగన్‌వాడీలాగ గుర్తించాలన్నారు.మినీ అంగన్‌వాడీ టీచర్లకు షరతులు లేకుండా మేన్ అంగన్‌వాడీ టీచర్‌గా గుర్తిస్తు అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే అంగన్‌వాడీలకు ఇచ్చే జీతంలో నెలసరి జీతంలో సగం పింఛన్ సౌకర్యం కల్పిస్తు రిటైర్మెంట్ పింఛన్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీలకు నాణ్యత గల డ్రస్సులను అందిస్తు ఐసీడీఎస్‌ను సంస్థగతం చేయాలన్నారు.అలాగే ఫోన్‌యాప్‌లు వెంటనే రద్దు చేస్తు బీఎల్ఓ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలన్నారు.అంగన్‌వాడీల్లో సరుకులు నాణ్యమైనవి అందిస్తు గ్యాస్ సిలిండర్‌లను రెండు ఉచితంగా అందించాలన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు నరసమ్మ,పరిగి ప్రాజెక్టు సెక్రటరీ మంజుల,కొడంగల్ ప్రాజెక్టులో సమ్మే చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు మద్దతుగా పాల్గొన్నారు. కార్యక్రమంలోఅంగన్‌వాడీ టీచర్ల సంఘం సభ్యులు రెహనాబేగం ,నవనీత,శివలీల, రత్నాభాయి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య,కొత్తూరు చంద్రయ్య,కొత్తూరు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

**-జాతీయ బిసి కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్**

**తాండూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని జాతీయ బిసి కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. విద్యార్థుకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని బిసి బాలికల కళాశాల వసతి గృహాన్ని వార్డున్ స్వప్న ఆహ్వానం మేరకు సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్లేట్స్, గ్లాసులను రాజ్‌కుమార్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద విద్యార్థుల చదువుకొరకై వేలాది రూపాయలు వెచ్చిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నతమైన స్థానాలలో స్థిరపడాలని సూచించారు. గత 13సంవత్సరాలుగా వార్డెన్ స్వప్న విద్యార్థులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న ఆమెకు బీసీ సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. అదేవిదంగా తాండూరు ప్రాంతంలో వసతిగృహాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ప్రస్తుత నూతన టెక్నాలజీని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి అనిత, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి నర్సమ్మ, ఫైన్‌బేగం, బీసీ యువజన కార్యదర్శి బోయ రాధాకృష్ణ, బీసీ యువనాయకులు రాము ముదిరాజ్, సాయి, భాస్కర్, మతిన్, శ్రీనివాస్, సురేందర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్లేట్స్‌ను పంపిణీ చేస్తున్న రాజ్‌కుమార్